

# గోరపిట్ట

## సువర్ణముఖి

కంది కొత్తలు రేపే అనుప్పండగ. "అవునూ... మీ మణెక్క ఇప్పుడెందుకు కోర్టుకి వస్తందే?" అడిగాడు మల్లు.

"నాకేటి తెలుసు? అసలు అక్క వస్తున్న భోగట్టా... అమ్మగారు సెప్పబట్టి తెలిసింది," శిరిమెల నడుస్తూనే జవాబిచ్చింది.

మల్లు చేతిలో సెవరపిల్లి చెవులున్నాయి. సెవర పిల్లి వెనక కాలు పైకి మడుసుకొంది. కొండ ఏటవాలు నీడలో నడుస్తున్నారిద్దరూ. శిరిమెల తలపై గుడ్డమూట. చేతిలో గుమ్మడికాయ. బుజాన కూర్చున్న గోరపిట్ట నాలుగు పక్కలా కళ్లు తిప్పుతోంది. కొండకి ఆనుకున్న చాపరాయిపై ఎండ పడుతోంది. ఆ చాపరాయి ఏట వాలుగా సూర్యుడిని అందుకోవాలన్నట్లుంది.

చాలామంది 'దుర్ల' (చందా) కోసం చుట్టుపక్కల గ్రామాలకి వెళ్లిపోయేరు. మల్లు ఏదో మాట్లాడుతూ చాప రాయి మీదకి వచ్చేసరికి చాపరాయి కింది భాగాన లేత ఎండలో తెల్లటి బట్టలతో వున్న దాదాపు పదిమంది మాట్లాడుతూ ఉన్నారు.

"చచ్చిపోనాం నాయినా...! ఈవాళ జల్మభూవి మీటింగే... అదిగోటి ఎమ్మెల్యే... అందరూ వచ్చినారు," అన్నాడు మల్లు.

"ఆ... మూర్తం కట్టుకొని తీర్తమెల్తే ముక్కుడు పోలమ్మ ఎదురయ్యిందట. మరి నువ్వు నసలకుమీ... అత్తల బస్సు తప్పోతే... పద్దకొండు పన్నెండుదాక సూసు కొని వోసిపోడమే," అంది శిరిమెల. గోరపిట్ట ఎగిరి కాళ్ల సందుల్లో దూరిపోతున్న గేతుని పట్టి మింగేసింది. అది మింగినపుడు విప్పిన తురాయిమొగ్గలా వుంది దాని నోరు. మాట్లాడుతూ కూర్చున్నవార్ని సమీపిస్తుంటే వాళ్ల మాటలు వినిపిస్తున్నాయి...

"మరి మీ ఆలోచనేటో నాకర్థం కాలేదు... తెలివా అంటే తెలివీలేదు. ఎనకత్తల నలుగురు మనుషుల లొత్తారా అంటే నాలుగు పురుగులైనా రావు! అలాటి సూరప్పడికి నాలుగు లచ్చల 'వర్కు' ఇచ్చినారు... మీ ఆలోచనేటో అర్థం కావడంలేదు... అసలు మళ్లీసరికి పోటీ చేస్తారా! చెయ్యరా?" పొడుగ్గా తెల్లగా సన్నగా ఉన్న మైదానప్రాంత నాయకుడు సూటిగా అడిగాడు.

ఆ మాటకి మరో నాయకుడు అందుకొని, "సూర ప్పడి మాట పక్కనబెట్టు! మా పక్కూరి వెంకటనాయ్డుకి అసలేటుందని...? ఆడి పెళ్లాం... ఏటి యింతన్నరా? ఆడిపెళ్లాం ఆడు సెప్పిన గుర్తుకి ఓటెయ్యదు. ఆడి పెళ్లానికి ఆడి సంగతి పూర్తిగ తెలుసుగాబట్టి అది... ఆడి మాటయినకపోడమే కరెట్టు. గానేటి? ఈడికైనా ఓ నీతి, నిజాయితీ నిలకడా ఉందేటి?... తెల్లారితే ఆ కోటలోన... పొద్దుబోతే ఆ కోటలోన... పొద్దల్లా మనతోటి! ఎవుడు తన్నినా మనవే ఉండాల. ఎవుడు తిట్టినా మనమే ఉండాల. అదిగో... ఆడికి... నాకు మంచినోరు రాదుగాని పి.సీ.లు తీసుకోవద్దని ఎమ్మెల్యేగారి రికమెండేషన్... ఇదీ పరిస్థితి. ఇలాగే నడిస్తే... మనం బతకడమూ కష్టమే... కార్యకర్తల్ని బతికించడమూ కష్టమే... ఆ..." అంటూ ఖైనీ తీసి పెదవిచాటున పెట్టి వెనక్కి తిరిగిపోయేడు. అతడి మాట మీద అతనికి చాలా గురి అని, మాటకు నిలబడే మనిషిని అతని అభిమానులు కొందరంటారు.

"నమస్కారం బావూ!" అన్నాడు మల్లు.

"ఆ... ఆ... కుందేలూ!" అంటూ చేతులు చాచారు ఎమ్మెల్యేగారు నవ్వుతూ. పిల్లాడ్ని అందించి నట్టు అందించబోయేడు మల్లు. శిరిమెల ముందుకు

నడిచింది. గోరపిట్ట ఎక్కడెక్కడో మేత కోసం వెనకనే ఉంది.

“వోయ్... నాకు ఇచ్చీవోయ్ కుందేలంటే మా ఆవిడకి బలే యిష్టం,” అంటూ ఎమ్మెల్యేగారు కుందేలును తన చేతుల్లోకి తీసుకున్నారు. మల్లు చేతుల్లోని కుందేలు ఎమ్మెల్యేగారి చేతుల్లోకి మారిన మరుక్షణమే రెండు గంతులెయ్యాల్సిన కుందేలు నాలుగు గంతులేసి అడవిలోకి చేరుకొంది. నాలుగు గంతులెయ్యాల్సిన మల్లు రెండు గంతులు వేశాడు. దూరం నుంచీ గీదరయ్య, “పట్టుకో... పట్టుకో...” అరుసుకుంటూ పరుగున వస్తున్నాడు. ఉలిక్కిపడి శిరిమెల వెనక్కి తిరిగేసరికి తలపై మూట చాపరాయి మీద పల్టీలు కొట్టుకొంటూ దొర్లింది. అలా దొర్లుతుంటే మూటలో ఉన్న నేదొండకాయలు, ఆగాకరకాయలు చెల్లాచెదురుగా కిందికి జారుకుంటున్నాయి.

ఎమ్మెల్యేగారు కొంచెం పైకెక్కి, “అనవసరంగా పోయిందయ్యా...” అన్నారు. మల్లు చేతులూపుతూ వచ్చేశాడు. “దొరకలేదా,” అన్నాడు మైదాన ప్రాంత నాయకుడు. “దొరికితే పట్టుకొని రానేటి?” అంటూ నవ్వేశాడు మల్లు.

“ఓరే మామా! నిండా సూలుందిరా... పరిగెత్త లేప్పోతుంది. ఈవాలో, రేపో ఈనెత్తదిరా,” గీదరయ్యకి చెప్పాడు మల్లు.

“పోనీరా...” గీదరయ్య అని, “బావూ... ఎక్కడికెలిపోతాది బావూ... మనుషులైనా, జంతువులైనా, పిట్టయినా... వొడుపు దొరికితే పారిపోతాయి... వొడుపు కుదరప్పోతే అమిరిపోతాయి. పోయిన ప్రతీదీ మన సంపదైతే... మనకి దొరక్కుండా ఎక్కడి కెలిపోతాది. బావూ... అయినా మీటింగు మొదలెట్టీసినారు... మీరు పాఁరండి బావూ...” అన్నాడు.

“సరే వచ్చేస్తాం... మీరు పదండి,” అంటూ ఎమ్మెల్యేగారు అలాగే నిల్చుంటే అతని చుట్టూ, మైదాన ప్రాంత నాయకులందరూ నిల్చున్నారు.

“బావూ... రేపు కందికొత్తలు అనుప్పండుగ. మీఁరా వాలి బావూ... సరదాగుంతాది,” అన్నాడు గీదరయ్య.

“రేపా... కుదరదయ్యా! హైదరాబాద్ వెళ్లాలి... ఫోనొచ్చింది... ఇంకోసారి వస్తానులే.”

“మీ యిష్టమే,” అంటూ మల్లు, గీదరయ్య నడక ప్రారంభించారు. వెనక మాటలు వినిపిస్తున్నాయి.

“మీ పద్ధతి ఏం బాగులేదండి... మా వూరిలోన యిల్లు లేనోల లిస్టు నేను పంపితే- ఆల కార్యకర్తలకే యిల్లు ఇచ్చారు మీరు. ఆలకీ... మీకూ తేడా లేదు. యిప్పుడు కుందేలు పారిపోయినట్టిగే ఒకడికొకడు పారిపోతాడు. మరి కోడికి కాలు పట్టుకుంతారు. బాతుని పీక పట్టుకుంతారు. కుందేలుకి చెవులు పట్టుకుంతారు. కుందేలుకి నడుం పట్టుకుంతే యిలగే జరుగుద్ది. ఇన్ని మాటలేల? ఎవుడినెక్కడ ఉంచాలో అక్కడుంచాల... ఎవుడినెక్కడ పట్టాలో అక్కడ పట్టాల. అంతేగాని...”

“సరేనా ఇంకేమైనా ఉన్నాయా?” ఎమ్మెల్యేగారు కోపంగానే అడిగారు. అడిగి, “నాకు తెలీక అడుగుతాను... సూరిప్పడికి ఇచ్చిన ‘వర్కు’ మీలోన ఎవుడైనా చెయ్యగల్డోయ్... ఆ చెప్పండివోయ్...! నాకూ తెల్సు! ఆ వూరిలోన సూరప్పడి పేరు జెప్పితే టీ చుక్క అరువు పుట్టదు... గానేటి? పదిరూపాయల వర్కు... ఆ వూరిలోన మీకిస్తే... పది సమచ్చరాలైనా చెయ్యలేరు. సరిగదా రోజుకి పది కంప్లయింటులు పెట్టించుతాడు కూర్మినాయుడు. అదే సూరప్పడనుకో అతనికి స్వయానా బామ్మర్ది... ఇంకేటంతాడు! గొంతు పెగల్లేదు... పది రోజుల్లోన బిల్లయిపోయింది,” కంఠసంగా చెప్పారు ఎమ్మెల్యేగారు.

“అయితేటంతారు.... మాకూ కుటమాం ఉంది... మా బామ్మర్దినో... మా తమ్ముడినో... మా మామనో అత్తలపార్టీలోకి పంపేమంతారేటి?”

“అది కాదువోయ్... అలగ తెగినోలికి, అలగ తెగదీశాం... వాళ్లకి అదే మిగులు. మన ముఖ్యమైన కార్యకర్తలకి ఇదిగో ఏజెన్సీ ఉందిగదా... తల్లి!

“ఐఫాడ్ నిధులొచ్చాయి. వోయ్ మూడు లక్షలూ... నాలుగు లక్షలూ... ఖర్మోటివోయ్... కోటి రూపాయల వర్కులు చెయ్యండివోయ్. ఎటువంటి కాంప్లికేషన్ లేదు. ఎటువంటి కంప్లయింటు లేదు... పల్లెత్తి మాట్టాడానికి మొలతాడు కట్టిన మొగాడే లేడు,” అంటూ నడిచారు ఎమ్మెల్యేగారు. వెనక కార్యకర్తలు వొకరి మొకం వొకరు చూసుకుంటూ కదిలారు.

“మనందరమూ కలిసి తొలీత మొలతాడు కట్టింది ఆడికే... ఆడు ఇలగంతన్నడు సూడురా,” అన్నాడు గీదరయ్య మల్లుతో.

“మల్లూ... మల్లూ...” అరుసుకుంటూ గోరపిట్ట వచ్చి బుజాన వాలింది.

*

‘ఓరెఁరిదానా! ఎందుకు అరుత్తావే! జల్మభూమి మీటింగంతే పొద్దల్లా ఉంతాదనుకున్నావేటి? ఇల గొత్తారు అలగెలిపోతారు... మానూరి కరెంటునాగ. అన్నీ సర్దీసి రడీ గుంచీ... మీటింగుకెల్తాం, వత్తాం బయిల్దేరి పోడమే...”

''పోన్నే ఏడాదికొక పండుగంతే... ఇంటిల పురుడు ఈదిలసావు... రా','' అంటూ మూతి విరిచి, గోడకు పాతిన అద్దం పెంకులో బొట్టు సరిచేసుకుంది. ఇంతకు ముందు అద్దంలో తన ముఖానికి బదులు పన్నెండు వందల రూపాయలు ఆల పసుపు, రెండు బస్తాల జొన్నలు కళ్లకు కనిపించి ముకాన్ని కప్పేసేవి.

శిరిమెల ఇప్పుడు ప్రశాంతంగా వుంది.

రచ్చబండ మీద కొందరు అధికారులు, అధికార పార్టీ నాయకులు కూర్చున్నారు. ఒక మూల మహిళలు కూర్చున్నారు. వారి మధ్యలో శిరిమెల చోటు చేసుకుంది.

చదువుకున్న కుర్రవాళ్లతో కాగితాలు రాయించి, ఆఫీసరుగారికి అందించుతున్నారు. ఆఫీసరుగారు గుమాస్తాకిస్తే గుమాస్తాగారు ఫైలు చేస్తున్నారు. రివ్వున ఎగురుతూ వచ్చి శిరిమెల బుజాలపై వాలింది గోరపిట్ట.

ఆఫీసరు దృష్టి పిట్ట మీద పడింది. మరలలేదు.

''అక్కా... చుట్టాలా,'' అంది గోరపిట్ట.

''ఊ...'' అంది శిరిమెల.

ఆఫీసరు మొఖం బీరపువ్వులా విరిసింది.

''బావూ! ఎండాకాలం వచ్చిందంతే అడివల అగ్గి బయం బావూ... అడివిల అగ్గిబుడితే... నాశినమైపోడమేగాని, ఆర్పడానికి నీలచుక్కలుండవు బావూ... అందుకని బావూ... గంటలనారీ ఆఫీసు అన్ని వూర్లకీ మందడిలో ఎట్టండి బావూ,'' అన్నాడు గీదరయ్య.

గోరపిట్ట టపటపా రెక్కలు కొట్టుకుంటూ దూరంగా గడికపై ఎగురుతున్న గేతుని పట్టుకొంది. ఆఫీసరు గాబరాగా లేచి పిట్ట దిశను గమనిస్తున్నారు. ఆఫీసరు వెనక గుమాస్తా లేచాడు. ఆయెనక అందరూ లేచి అటు చూసేలోపు గేతుని మింగి, ఎగురుతూ వచ్చి శిరిమెల బుజాలపై వాలింది. నోడల్ ఆఫీసరు కూర్చున్నాడు. గుమాస్తా కూర్చున్నాడు. గాబరాగా, ''అలగే... వూరికొక అగ్నిమాపక కేంద్రం...'' అంటూ, ''ఆ... కాదు కాదు ప్రొపోజల్స్ పెడతాం,'' అన్నాడు నోడల్ ఆఫీసరు.

ఎమ్మెల్యేగారు కలుగజేసుకొని, ''ఈ విషయం అసెంబ్లీలో చర్చించాను. తొందరల్లో పని జరిగిపోద్ది,'' అన్నాడు.

''బావూ! మీకు మునుపోలు ... ఆలకి మునుపోలు... అందరూ అదిగోదిగక్కడే అడిగీసి అలిసిపోనారు.''

''లేదు... లేదు... ఈసారి వస్తుందిలే,'' అన్నాడు మైదాన ప్రాంత నాయకుడు ధీమాగా.

''మీరు చూసినారేటి బావూ... లేప్పొతే అక్కడ బయిల్దేరిందేటి?'' అన్నాడు గీదరయ్య. అందరూ గొల్లున నవ్వారు.

''సార్ మొత్తం నూటాపదహారు దరఖాస్తులొచ్చాయి. అందులో ఓ పాతిక వ్యక్తిగత సమస్యలకి సంబంధించినవి, ఇరవైమూడు శాంతిభద్రతలకి సంబంధించినవి. మిగతావి... గ్రామానికి సంబంధించినవి,'' అంటూ ఫైలు మూశాడు గుమాస్తా.

''వచ్చే విడత జన్మభూమి నాటికి పూర్తి చేద్దాం,'' అని లేచిపోయి గీదరయ్య దగ్గరికి వచ్చి, ''ఏమీ అనుకోకపోతే... ఆ మైనా నాకు కావాలయ్యా,'' అన్నారు నెమ్మదిగా ఆఫీసరుగారు.

గీదరయ్య ఒక్క క్షణకాలం ఆఫీసరు వంక చూచి, ''బావూ అడివికొచ్చినోలు ఎవులికీ వొట్టి చేతుల్తోటి పంపనేదు బావూ... మాం గూడా ఎవులు దగ్గరికెల్లినా వొట్టి చేతుల ఎల్లనేదు బావూ...! అందరికీ నమ్మినాం... కొందరికి అడవి కలప ఇచ్చాం... కొందరికి కొండదినుసు ఇచ్చాం... కొందరికి మా పిల్లల్ని ఇచ్చాం... ఎదురు బాణాలిచ్చినాం! ముచ్చట పడతన్నుగదా తీసుకెల్లండి బావూ... బంగారమా... బాగ్గెమా... అడవిల తిరిగిన పిట్ట,'' అంటూ గీదరయ్య శిరిమెల వైపు నడిచాడు.

అప్పటికే అన్నీసర్దేసి జీవుల్లో కూర్చున్నారు. వచ్చిన వారందరూ ఆడామగా పెండికట్టులా నిల్చున్నారు...

వెళిపోవడానికి సిద్ధమౌవుతున్న వాళ్లని చూస్తుంటే జోబగూడ జాతరకొచ్చిన రికార్డింగ్ డాన్స్ ట్రూప్ జ్ఞాపకమొచ్చింది మల్లుకు. శిరిమెల బుజాన వున్న పిట్టని పట్టి, ''అమ్మీ నీకు నాలుగు పిట్టలు తెత్తానులే,'' అనేసి తీసుకొని వెళ్లి ఆఫీసరు చేతిలో పెట్టాడు గీదరయ్య. ఆఫీసరు ఎడమచేతితో పిట్టను పట్టి, కుడిచేతితో నిమురుతూ అక్కడి నుండి నాలుగు అడుగులు వేసి జీపువైపు వెళుతుంటే - శిరిమెలకు ఏమీ అర్థం కాలేదు. రెండడుగులు వేసి, ''గోటీ...'' పెద్ద గొంతుతో అరిచింది. కొండ చాప రాయి గొంతు కలిపి మూడుసార్లు, ''గోటీ... గోటీ... గోటీ...'' అని ఘోషించాయి.

''అక్కా... అక్కా,'' గోరపిట్ట ఆఫీసరు చేతిలో గింజులాడుతూ అరుస్తూనే ఉంది. ఆఫీసరు వెనక్కి చూశారు.

''మీరెల్లండి బావూ!'' అన్నారెవులో. జీపు కదిలింది గోర్జిలో ధూళి కమ్మేసింది.

అరుస్తూ శిరిమెల పరుగందుకుంది. ''గోటీ... గోటీ,'' పిలుస్తూనే పరిగెడుతోంది.

ఈ సమస్త ప్రపంచం ఓ సుడిగుండంలో మునిగి పోతున్నట్టు చాపరాయి, కొండచాప చుట్టుకొని కూరుకు పోతున్నట్లు ఏపుగా పెరిగిన పాసి, మామిడి, ఇప్ప, చింత చెట్లు వేళ్లతో పెకిలించుకొని కొట్టుకుపోతున్నట్లూ తనూ ఆ ప్రవాహంలో భూమి పొరల్లోకి వెళ్లిపోతున్నట్లు అనిపి స్తోంది శిరిమెలకు.

'కన్నులతో చూసేది గురువా కనులకు సొంత మవునా,' దూరమవుతున్న జీపులోంచి పాట వినిపిస్తూనే వుంది. గోర్జిలో తెల్లతామర చెట్టు కింద పడిపోయింది శిరిమెల. మల్లు, గీదరయ్య పట్టి లేపుతుంటే చెల్లి జ్యోతిని ఎత్తుకొని తల్లి బంతెమ్మ-

"ఏడకే నా తల్లి ఏడకే.... అక్క ఎక్కడికెల్లదే," అన్న బుదరింపులు వినిపిస్తున్నాయి. భూమి, ఆకాశం కలిసి తిరుగుతున్నట్లుంది.

ఇరవైయేళ్ల కిందట ఇలాగే పిట్టలాగే మణిక్కని ఆఫీసరు తీసికెలిపోవడం, చేతివారా అమ్మ అప్పజెప్పి, రెండు వాసాల నడుమ తల్లి పడిపోయి ఏడటం తల దగ్గర జ్యోతి, యిప్పచెట్టు దగ్గర నాలుగేళ్ల ప్రాయంలో తమ గతం దృశ్యమై కళ్ల ముందు నిలబడుతోంది.

*

ఊరి ముందు చింతచెట్టుకి రెండు ఎదురు బొంగులు కట్టారు. ఎదురుబొంగంతా సాపుగా రెలిసీ శారు. కిందన కాలు పెట్టుకోవడానికి వీలుగా రెండు కొమ్మలు మాత్రం ఉంచారు. ఒకదానిపై మణిమ్మ మరో దానిపై ఇంకో కుర్రవాడు అటూ ఇటూ కాళ్లు ఎట్టి బొంగు పట్టుకొని నిలబడగా పిల్లలంతా ఊపు తున్నారు... గడవేగం అందుకుంది. చెట్టుకొమ్మలికి తగి లేటట్టు ఊగుతున్నారు. మణిమ్మ గౌను గాలివాటంగా ఎగురుతోంది. మణిమ్మ భయపడకుండా అంతవేగం లోనూ ఒక్కసారి ఒక కాలును తప్పిస్తూ ఒక్కోసారి ఒక చేయిని వదులుతూ విన్యాసాలు చేస్తుంది.

జీపు శబ్దమైంది... జీపాగింది. పిల్లలంతా వదిలీసి జీపు దగ్గరికొచ్చేశారు.

ఆదివాసీ రైతులు ఆఫీసరుకు నమస్కారం చేసి సమస్యలు చెప్పడం మొదలుపెట్టారు.

ఆఫీసరు దృష్టి గాలిలో వేగంగా కదులుతున్న ఎదురుబొంగులు... వాటిపై విన్యాసాలు చేస్తున్న మణిమ్మపై పడింది. నడుచుకుంటూ అక్కడికి వెళ్లారు.

"ఆ అమ్మాయి ఎవరు?" అడిగాడా ఆఫీసరు.

"మా సోములు కూతురు బావూ."

"ఇంకేమి సోములురా... మా బంతెమ్మ కూతురు బావూ."

"ఏమీ? సోములుకేమైంది?"

అక్కడ నిల్చున్న వారంతా తలలు దించేశారు.

"ఫరవాలేదు చెప్పండి," ఆఫీసరులో గొంతులో అడిగారు.

బంతిమ్మ జ్యోతిని ఎత్తుకొని వచ్చి నిల్చుంది.

"బావూ మీకు తెలీంది ఏటుంది బావూ... పోరా టకం జరిగిందిగా బావూ... అదిగా పోరాటకం తొలి తొలీత మొదలౌతున్నప్పుడే ఆడ్ని పట్టికెల్లిపోనారు బావు... చచ్చిపోనాడని వదిలీసినాంబావూ... అదిగా తరవాత బారిడి గురువుని చంపీసిన ఏడాది తిరిగొచ్చినాడు బావు. జైలు కాసి వచ్చినానని చెప్పినాడు బావు. ఆ తరువాత చక్కగా సంసారం చేసుకొని మా ఊరికి పెద్దలాగ, కట్టానికీ, సుకానికీ అందర్నీ కట్టుజేసి కర్రలముట్టిలాగ నడిపినాడు బావూ. కిందటేడాది ఇదిగో కార్పొరేషన్ గొడౌన్ కడతున్నప్పుడు.... అదిగోటి సంకలోన పిక్కురు దాయి కడుపులున్నప్పుడు ఆ యిద్దరు పెక్కురోల్ని దాని కప్పజెప్పిసి ఆల గురువుల దగ్గరి కెలిపోనాడు బావూ...."

బిడ్డికోలి ముసిలోడు చెప్పి మునకాల కర్ర దన్ను మీద చిన్నరాయిపై కూర్చుండి పోయినాడు. బంతిమ్మ వైపు చూశాడు ఆఫీసరు. బంతిమ్మ కళ్లు నీళ్లతో నిండి పోయాయి. సంకలో పిల్ల, కాళ్లు పట్టుకొని శిరిమెల.

"ఏమ్మా... మీ అమ్మాయిని నాతో పంపించు. అమ్మాయి చాలా చురుకుగా వుంది. ఆటపాటలతో పాటు చదువు చెప్పించి మంచి ఆఫీసరుగా చేస్తాను... ఆ... పాప పేరు...?"

"మణిమ్మ బావూ"

"మణిమ్మను... ఈ అడవికి మణిదీపం చేస్తాను."

బంతెమ్మ మౌనంగానే వుంది.

"నాతో పంపించడానికి మీకేమైనా అభ్యం తరమా?"

"లేదు బావూ... లేదు... రా బావూ రా," అంటూ బంతిమ్మ ఆఫీసరుని తీసుకొని మొగనాలి కొండెక్కి కొసిమిచెట్టు కింద నిల్చొని, నాలుగుదిక్కులూ చూపెట్టి మాటాడుతోంది. ఆఫీసరు బంతెమ్మ మొకం చూస్తూ నాలుగు దిక్కులూ చూస్తున్నారు. వూరి జనమంతా పైకి చూస్తున్నారు. శిరిమెల, మణిమ్మ కూడా అమ్మవైపే చూస్తున్నారు.

ఏడ్చుకుంటూ బంతెమ్మ, నచ్చజెప్తూ ఆఫీసరు కిందకి దిగారు. ఊరి జనం చుట్టూ చేరారు... బంతెమ్మ ఇలా అంది....

"అది బావూ... అందరికీ నమ్మినాం... నమ్మినో లందరికీ అన్నీ యిచ్చాం. మీకూ నమ్ముతాం... పెంచినా మీరే... చంపినా మీరే!" అంటూ వెళ్లి మణెమ్మని తీసుకు

వచ్చి నుదుటిపై ముద్దు పెట్టి ఆఫీసరుకిచ్చింది. ఎవరూ మాట్లాడలేదు.

నల్లగా మబ్బులు కమ్ముతున్నాయి. "బావూ బయల్దేరండి బావూ... మేగిం వాలకం చూస్తే దరువు తీస్తా బావూ," అన్నాడు బిడ్డికోలి ముసిలోడు.

"అక్కా... మణిక్కా..." అంటూ జీపు వెనుక శిరిమెల ఏడుస్తూ పరిగెడుతూనే వుంది. యిప్ప చెట్టు దగ్గర పడిపోయింది.

జ్యోతిని ఎత్తుకొని వెళ్లి బంతెమ్మ బుదరించింది.

"ఏడకే నా తల్లీ అక్క ఎక్కడికీ ఎలిపోదులేయే," అంటూ తీసుకొని వచ్చి వీధి మధ్యలో పడి ఏడ్చింది. తనని తనే తిట్టుకుంది... సోములు చచ్చిపోయిన అగ్గి ఆరలేదు... బుగ్గి ఎగరలేదు మరిది అన్న మాటలు చెవుల్లో తిరుగుతూనే ఉన్నాయి.

"వదినా ఎందుకు బాధపడతావు... నువ్వు నాకు ఉండిపో... అలగైతే మీ కొండ, మా కొండ కాకుండా మరొక కొత్త కొండ చేసుకొని బతకొచ్చు."

మౌనంగా కాళ్లల్లో బుర్రపెట్టి కూర్చుంటే కాళ్లకి ఇద్దరాడపిల్లలు చేరబడి కూర్చున్నారు. ఆ రాత్రి ఆలోచనలు నిద్ర పట్టనీయలేదు. శిరిమెల ఏడుస్తూనే ఉంది... బంతెమ్మ బుదరించింది. ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి కొన్నాళ్లకి మనసు ఒగ్గేసి జ్యోతినీ శిరిమెలనీ వదిలేసి భర్త సోముల దగ్గరికి వెళ్లిపోయింది.

*

"అమ్మీ... ఏడకే... లెగే ఎక్కడికో ఎల్తానన్నావు," శిరిమెల చెయ్యి పట్టి లేపుతూ అన్నాడు గీదరయ్య.

"నువ్వు మరీ తెలీనట్టగ అడుగుతావేటి మావా... ఆళ్ల మణిక్క దగ్గిటికి ఎల్తానని అదొకపాలి చెప్పింది. నానొక పాలి చెప్పినాను."

"ఆ మర్సిపోనానురా... నెగమ్మీ నెగే... ఎక్కడికో ఎల్తానన్నావు," మళ్లీ అడిగాడు గీదరయ్య. కిసుక్కున నవ్వింది శిరిమెల... ముగ్గురూ నవ్వారు. సామాన్లు సర్ద డానికి మల్లు పరిగెడుతుంటే ఆపి గీదరయ్య అన్నాడు.

"అమ్మీ... మనం మన యిష్టం వచ్చినట్టగ బతక లేమే... అందరికీ యిష్టపడినట్టగే మనం బతకాల... మన యిష్టమొచ్చినట్టగ మనం బతకాలని మా తమ్ముడు... మీ మామ... దెబ్బలాడి ఎందరో చచ్చిపోనారమ్మ... గోర పిట్టని తెస్తానులే బాధపడకు సుమీ... మర్సిపోనానుగాని రాత్రికి పొర్రాండి... మీ యిద్దరూ డానసు చెయ్యాలి నాను డప్పుకొట్టాలి," చెప్పి పోడు వైపు నడిచాడు. పట్నం బయల్దేరారు ఆలూమగలిద్దరూ.

*

"టీ తాగుతారండీ," అడిగాడు హోటల్ యజ మాని.

"లేదండి," ముఖం చిట్లించారు నేరేడు మాను గూడ అమ్మగారు.

"ఉందండీ," అన్నాడతను.

"ఓహో ఉందేటి... అయితే నాకొద్దండి," అన్నారు అమ్మగారు.

"ఫరవాలేదు తాగండీ... డబ్బులివ్వక్కరలేదు," అన్నాడతడు.

"అందరికీ అలగేనా ఎప్పుడు నుంచీ," నవ్వుతూ అడిగారు అమ్మగారు.

హోటల్ యజమాని నవ్వేస్తూ, "ఏటి? అప్ ఎండ్ డౌన్ చేస్తన్నారేటి?" అనడిగాడు.

"లేదండి. మేస్ట్రుద్యోగమే చేస్తన్నాను," నవ్వ కుండా అమ్మగారంటే హోటల్ యజమాని గ్లాసులు పగిలిపోయినట్టు నవ్వాడు. ఆ యిద్దరూ ఎప్పుడూ మాట్లాడినా వినడానికి పదిమంది పోగవుతారు.

"ఏటి మీ బస్సు యింకా రాలేదేటి?" అన్నా డతను.

"అమ్మగోరూ..." దూరం నుంచే పలకరించింది శిరిమెల.

"అదిగో మా బస్సు" అనీ "సిరీ..." అంటూ ముందుకు నడిచింది.

శిరిమెల దగ్గరకొచ్చింది.

"ఈరోజు మీరొస్తున్నట్లు... మీ అక్కతో చెప్పాను... ఇప్పుడే ఓ గంట కిందటే కోర్టుకి వెల్తుంది. కోర్టు దగ్గర ఉంటానన్నాది వెళ్లండి. మనూరు బస్సుకే వచ్చారు గదా... నేనెల్తానయితే... అలగే... తిన్నగా వెళ్లండి. దగ్గరే," నడుస్తూ చేతులతో దారి చూపుతూ వెనక్కి తిరుగుతూ... ముందుకు నడిచారు అమ్మగారు.

హోటల్ యజమాని సంచి పట్టుకొని వస్తూ, "అందరిలాగ మీరెందుకండి గాబరా అయిపోతారు... డ్రైవర్‌కి ఎదురు సీటు మీదే గదా," అంటూ కర్రల సంచి అమ్మగారికి యిచ్చి, "మందులని చెప్పండి," అన్నాడు. అమ్మగారు తలూపి, కర్రల సంచి ఊపుతూ నడిసేసారు.

కోర్టు కనిపిస్తోందిగాని, దారి కనిపించడంలేదు. చుట్టూ ఇనపతివ్వలెలుగు. హడావిడి సంతలా అనిపిం చింది మల్లుకి. ముగ్గురూ... నలుగురూ... పదిమందీ... గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటూ లాయర్ల వెంట నడుస్తున్నారు.

'కుదరదు' 'వద్దు' 'అవ్వదు' లాంటి పాడిమాటలే! పసువుల బేరంలా అనిపించింది మల్లుకి. శిరిమెల మెట్ల

దగ్గర కూర్చుంది. కుడిపక్క మూట ఎడమపక్క గుమ్మిడి కాయ సర్ది లోపలికెళ్లాడు మల్లు. గదుల్లో కూర్చుని రాసుకుంటున్నవాళ్లు... పొరపాటున కూడా బయటకు చూడటంలేదు. బయట నుంచి గది లోపలికి చూస్తు న్నారు జనాలు కొందరు. మల్లు వెళ్లి లోనకి చూశాడు. మణిమ్మా... తోటల్లుడూ ఇద్దరూ నిల్చున్నారు. లాయర్లు మాట్లాడుతున్నారు.

“అదేంటి సార్! కింది కోర్టుకెళ్తే ఇక్కడకు వెళ్ల మన్నారు... మీరిలా అంటే...”

“అవును కరెక్టేగాని ఆదివాసీ వివాహం... హిందూ వివాహచట్టంలోకి రాదు,” అన్నాడు మేజిస్ట్రేట్‌గారు.

“అయితే... ఆదివాసీలు... హిందులూ కాదు. ముస్లింలూ కాదంటే ఎందులో ఉంటారయితే?”

“ఇంతవరకు ఆంధ్రాలో ఎక్కడా ఆదివాసీ జంట విడాకుల కోసం కోర్టుకు రాలేదు. కనుక మనకు అను భవాలు లేవు. వారి విడాకులు వారి సాంప్రదాయాల్లోనే జరిగాయి.”

“మణిమ్మ-సూర్యారావుల విడాకులు అధికారి కంగా ఎలా యిప్పించాలో చెప్పండి మరి,” చివరిగా అడిగాడు లాయర్. మేజిస్ట్రేట్ నవ్వుతూ వెళ్లిపోయేరు.

మణిమ్మ బయటకు చూసింది. ఎదురుగా మల్లు!

*

“ఏటి తగువు”

“ఏదోలే మీరు బాగున్నారా?.... శిరి నువ్వు బాగు న్నావా... రండి టీ తాగుదాం,” అలా మాటల్లో మణిమ్మతో శిరిమెల, మల్లు నడిచారు.

“అవునూ! జ్యోతి ఎలా వుంది... చూసి చాలా రోజులైంది,” అడిగింది మణిమ్మ. “ఏమో... మొన్న పొలి సంతలో జేమ్స్ కనిపించాడు. మా చెల్లిలు ఎలాగుందని అడిగితే, ‘కుళ్లిపోయింది,’ అన్నాడు. జేమ్స్ గొప్ప యికట దారి. ఏమాటా తిన్నగ చెప్పడు,” అంటూ నవ్వి మరు క్షణమే, “నీ తగువేటక్కా,” అని అడిగింది.

“ఏదేలే... మీ బావగారు మనమనుకున్నంత మంచివారు కాదు. అతనితో విడాకులు తీసుకోక తప్ప లేదు. గానీ ఈ కోర్టుల చుట్టూ తిరుగుతుంటే అతనె లాంటి వాడైనా ఆడితోటే ఉండటం మంచిదిలాగుంది,” ఇబ్బందిగా నవ్వింది మణెమ్మ.

“నాకు తెలీక అడుగుతాను... మొగుడూ పెళ్లాలు యిడిపోడానికి కోర్టులెందుకక్కా... నువ్వు సదుం కున్నావు. నీకు నాను సెప్పడమేటిగాని యిష్టపడినోడి తోటి ఎలిపోతే... తొలి మొగుడు ఆడి మానాన్న ఆడే తప్పుకుంతడు... తప్పుకోకపోతే తప్పు కట్టమంతాడుగాని, ఉరితీసేడు గదా!... మరి నా నేటి సేసినాను?” చెప్తూ మల్లు ముఖం చూసింది శిరిమెల. మల్లు నవ్వాడు. శిరి మెలను నవ్వుతో చూస్తూ టీ చెప్పింది మణిమ్మ.

“ఏటండి... జిలేబి, పకోడి ప్రెస్సండి. తినండీ టీ తాగుదురుగాని...” అంటూ వెనక్కి తిరిగి, “ఓరే అయ్య గారికి, మూడు జిలేబి పకోడి పట్రా,” కుర్రాడ్ని కేకేశాడు హోటల్‌వాడు బెంచీపై కూర్చున్న మల్లుని చూస్తూ. “ప్రెస్సంటే... నిన్నటివే,” అని, “జిలేబి తింటావా,” అడి గింది మణిమ్మ. మల్లు నవ్వు ప్రారంభించాడు. శిరిమెల పయ్యాట కొంగు నోట కుక్కుకుంది. ఎందుకు నవ్వు తున్నారో అర్థంగాక చిత్రంగా చూస్తోంది మణిమ్మ.

“ఈ జిలేబి మాటే మా యిద్దర్నీ కలిపింది,” అంటూ శిరిమెల నవ్వుతోంది. శిరిమెల నవ్వు... శిరిమెల కోపం... శిరిమెల భయం... మొగనాలి గాటీ గతమంతా మల్లు కళ్ల ముందు కదులుతుంది.

*

“జిలేబీ జింతేపో,” (జిలేబీ తింతావా) అడిగాడు మల్లు. సంతగోల హడావిడిగా వుంది. తెలిసినవాళ్లు తిరుగుతున్నారు. శిరిమెల బయం బయంగా చుట్టూ చూస్తూ - బట్టల దుకాణాల సందుల్లోకి వెళ్లి కిరాణా దుకాణాల సందుల్లోంచి గాజుల దుకాణం దగ్గరకొచ్చి మల్లు చేతిలో జిలేబి లాక్కొని పారిపోయింది. మల్లు మరో పది జిలేబీలు కొని కుర్రాళ్లకు ఆనందంతో పంచాడు. జిలేబీ తింటే వారి మధ్య ప్రేమ బలపడినట్టే. అందుకే సంతల్లో పెద్ద పెద్ద జిలేబీ కొత్త ప్రేమికుల కోసం రడీగా ఉంటాయి.

మొగనాలి గాటీ... శిరిమెల కొండ ఏటవాలులో మొగ్గలేరుతుంది. మల్లు బయపడుతూ దగ్గరకొచ్చాడు... శిరిమెల పినతండ్రి, వూరిలోన ఇంకొకరికి శిరిమెలని మొగనాలికిచ్చి ‘ఓలి’ కూడా తీసుకున్నాడు.

“కోసింమాను గూడోలు మహా కోపదారులు...” ఆ వూరిలో మొగనాలికిచ్చిన అమ్మాయిని ఎవరో కుర్రాడు గతంలో ఎత్తుకుపోతూ మొగనాలి తెచ్చుకోవా లని, అనుకుంటున్నవాడి కంట్లో పడ్డాడట!

గాటీ శిఖరానికి చేరేసరికి, “ఇది మొగనాలిరా,” అంటూ ఒకే వేటుకి కుర్రాడి తలనరికి, అదే కత్తితో, “లంజిముండా నాను ముసిలోడ్నే,” అంటూ అమ్మా యిని నరికి అక్కడే పాతిపెట్టాడట. అందుకే కోసం మానుగూడ పేరెత్తినా... ఆవూరి యువతులన్నా అంద రికీ భయం... అసలందుకే ఆ గాటికే ‘మొగనాలి గాటీ’

అని పేరొచ్చిందట అని మల్లు తన ప్రేమ గురించి చెప్పినపుడు గీదరయ్య చెప్పాడీ కథ.

మల్లుకి భయమేసింది. ఏదో ధైర్యం...

"శిరిమెల," పిలిచాడు.

"వద్దు... మా చిన్నాయిన వత్తాడు..."

"ఫరవాలేదు. రా..." అంటూ రెక్క పట్టుకొని గాలి కెదురుగా పరుగు తీశాడు గంప జారిపోయింది.

మొగ్గ రాలిపోయింది... శిరిమెల ముఖం మొగ్గలా మారింది. శిరిమెల పయ్యాటకొంగు గాలిలో తేలి ఆడు తోంది. శిరిమెల జత్తు సుడులు తిరుగుతుంది. పోడు మీద మొజ్జుల్ని, కందికొయ్యల్ని తప్పించుకు వస్తుంటే... ముందే సిద్ధం చేసిన నేరేడు మానుగూడ కుర్రవాళ్లు గుంపుగా గోల చేస్తూ వచ్చి ఇద్దరినీ ఎత్తుకుపోయారు.

*

కుర్రోలు రచ్చబండ మీద కూర్చున్నారు. గీదరయ్య ఎదురు సాల దగ్గర చిన్న రాయిమీద కూర్చు న్నాడు. కొసింమానుగూడ పెద్దలు, శిరిమెల పినతండ్రి వూర్లోకి వచ్చారు.

"ఏంవోయ్ ఇలగ దిగబడ్డారు," అడిగాడు గీదరయ్య.

"పందికూన తప్పోనాది... ఎతుకుతన్నాం," అన్నా రెవులో.

"తప్పోతే... అడివికాడ ఎతకాలగాని, వూర్లోన దొరుకుతాదేటి?" అన్నాడు గీదరయ్య.

"తప్పోయింది... అడవి పందికూన కాదు... ఊర పందికూన," అన్నారు కోసింమానుగూడ వాళ్లు.

"మరీ... ఈ డొంక తిరుగుడెందుకు? మీ కూన మా గూడకే సేరింది."

"మల్లూ.... ఆలిద్దరూ ఇష్టపడ్డారు," గీదరయ్య చెబుతుంటే, "మరిసెప్పకువోయ్... ముందు అదెక్క డుందో చెప్పు... నరికేసి ఎలిపోతాను," అన్నాడు శిరిమెల పినతండ్రి ఊగిపోతూ.

"నీకు పిచ్చేటివోయ్."

"అవును నాకు పిచ్చి... దీని తల్లీతండ్రీ చచ్చిపోతే కడుపుల పెట్టుకొని పెంచాను. నా కిష్టమొచ్చినోడికి ఇచ్చి ఓలి తీసుకున్నాను... ఈవాళో... రేపో ఆడిల్లు మట్ట వలసిన పిల్ల... దానికిష్టమని మీవోడితోటి ఎలిపొత్తే నా పరపతి ఏటైపోవాల," అంటూ చుట్టూ చూశాడు. ఓ ఇంటి తలుపు చాటు నుండి ఏడుస్తోంది శిరిమెల.

"కూకోవోయ్," అంటూ శిరిమెల పినతండ్రిని కూర్చోబెట్టాడు గీదరయ్య.

మాటలు పెరుగుతున్నాయి... తగ్గుతున్నాయి.

"ఆలిద్దరూ ఇష్టపడ్డారు... మనమెవులం మద్దీన," అన్నమాటకి కట్టుబడి గతంలో శిరిమెల పినతండ్రి తీసు కున్న ఓలి పన్నెండువందల రూపాయిలు, ఒక ఆల పసుపు, రెండు బస్తాల జొన్నలు తప్పు కింద మల్లు చెల్లిం చాలని రచ్చబండ తీర్మానించింది.

మల్లు అంగీకరించాడు.

"రారా మల్లూ నీచేత్తో ... మనిషికొక గలాసిచ్చి," అన్నాడు గీదరయ్య కుండను రెండు చేతులతో పట్టు కొని మల్లును చూసి!

*

జిలేబి, పకోడి తిని టీ తాగుతున్నారు ముగ్గురూ. మణిమ్మ, శిరిమెల ఏవేవో మాట్లాడుతున్నారు. రాను రాను పట్టణంలో రద్దీ పెరిగిపోతున్నట్లనిపిస్తోంది మల్లుకి.

"అప్పు తీరిపోయిందా..." అనడిగింది మణిమ్మ.

"బగమంతుడి దయవల్ల... పూర్తిగా తీరిపో..." అంటుండంగానే నీలిరంగు వ్యాను దాటిపోతుంటే వ్యాను వెలుపల ఇనుపచువ్వలపై, రెండు చేతులూ ముక్కూ నుదురూ ఆనించి, "అక్కా....' అనే పిలుపు వినిపించింది.

శిరిమెల చూసింది. చేతిలో గాజుగ్లాసు కిందపడి బళ్లున పగిలింది.

"జ్యోతీ..." అని పిలిచి వ్యాను వెనుక పరుగందు కొంది శిరిమెల. వెనుక మణిమ్మ, మల్లూ పరుగందు కొన్నారు. "జ్యోతీ... జ్యోతీ..." పిలుస్తూనే పరిగెడుతుంది. పంజరంలో చిక్కుకున్న రామచిలుక ఇనుపచువ్వల్ని కాళ్లతో రక్కుతున్నట్లు కనిపిస్తోంది మణిమ్మకు. సైకిళ్లూ... మోటార్లు... జీపులూ తప్పించుకొని పరిగెడుతూనే వున్నారు. అరుస్తూనే వున్నారు.

"మేడినిండియా... మేడినిండియా... లాల్ల లాలల, లాల్లలాల్లలా..." పెద్దగా వస్తున్న పాటలో కలిసి పోయింది వాళ్ల అరుపు. వ్యాను శ్రీకాకుళం వైపు తిరిగి పోయింది.

"శిరి... శిరి... ఆగు... ఆగు..." పిలుస్తూ పరుగున వెళ్లి పట్టుకొంది మణిమ్మ.

కొత్తూరు రోడ్డులోంచి రెండు లారీలపై జనం గోల చేసుకుంటూ వస్తున్నారు.

"కిల్లాడ జ్యోతిని వెంటనే విడుదల చేయాలి!"

గోలగోలగా దాటుకుంటూ వెళ్లిపోయారు. పోలీస్ స్టేషను ఎదుట అరుపులు పెరుగుతున్నాయి. జనం పెరుగుతున్నారు. పట్టు కనిపించని తేనెటీగలా అక్క డున్న అన్ని ఆఫీసులకీ తిరుగుతోంది మణిమ్మ.

అరుపులు... నినాదాలు పెరుగుతున్నాయి. పొడుగ్గా సన్నగా వున్న ముసలాయన అందరికీ సూచనలు చేస్తు న్నాడు. అప్పుడెప్పుడో జరిగిన పోరాటంలో మహా నాయకుడని ఎందరో చెప్పగా అనేకసార్లు విన్నది మణిమ్మ. ఆయనకు పరిచయం చేసుకొంది. కిల్లాడ... కొసింమానుగూడ జనాలు ట్రాక్టర్లలో వచ్చేశారు. ఇంటి నుండి బయటకు వచ్చిన తరువాత మొకం చూడడానికే భయపడే శిరిమెల ఏడ్చుకుంటూ పినతండ్రి ఒడిలో చేరి పోయింది. దూరంగా అశోకచెట్టు కింద జేమ్సు చాలా విషాదంగా కనిపిస్తున్నాడు. నవ్వుతూ నవ్వించే జేమ్సుని చూస్తుంటే... ఏవో జ్ఞాపకాలు కదులుతున్నాయి శిరిమెలకు.

శిరిమెల పెళ్లి జరిగిన రెండు నెలలకే జ్యోతి పెళ్లి.

జ్యోతి పెళ్లినాటికి... అడ్డయ్య అని పిలచేవారు... అప్పుడు,

'పిల్ల ఎలాగుందిరా,' అని వాళ్ల పెద్దలడిగితే, 'నా పెళ్లాంలాగుంది,' అన్నాడు. అందరూ నవ్వి పెళ్లి కాయం చేశారు. పెళ్లయిన ఆరునెలలకే అడ్డయ్య కిరాస్తాన్ మతం తీసుకుని జేమ్సుగా మారాడు. శిరిమెలకి నచ్చేది కాదు. ఆగం పండుగ చుక్క పండగలకి వచ్చేవాడుకాదు. శిరిమెల ఎన్నో కబుర్లు పెట్టేది. అయినా "నాకు రావాలనే ఉంది. కానీ మీరు దేవతలకీ దెయ్యాలకీ మొక్కు తారు," అనేవాడు. రోజూ ఉదయాన్నే స్నానంచేసి ఉతి కిన గుడ్డలు కట్టుకోవడం, శిరిమెలకి ఎంతగానో నచ్చేది.

"జ్యోతిని బయటకు పంపకపోతే మిమ్మల్ని బయటకు రానివ్వం."

దూరంగా ఉన్నవాళ్లందరూ చూశారు... శిరిమెల, జేమ్సు అందరూ దగ్గరగా వచ్చారు. అందరికీ ఆశ్చర్యం... మణిమ్మ కుడిచేతితో సవాలుచేస్తూ నినాదాలు చేస్తోంది. పక్కనున్న పెద్దాయిన కూడా మణిమ్మతో సమానంగా అరుస్తూనే ఉన్నాడు. సాయంత్రం నాలుగు దాటింది. సూరీడు మగ్గుతున్న మామిడిపండులా ఉన్నాడు. బస్సులు, లారీలు... ఎటువటు ఆగిపోయాయి. పోలీసులు జనాన్ని రొప్పుతున్నారు.

"జ్యోతిని విడుదల చేయకపోతే మమ్మల్ని అరెస్టు చేయండి," అరిచింది మణిమ్మ .

ఎన్నో గొంతులు వెంట అరిచాయి. రాజకీయ నాయకులందరూ మణిమ్మను చూశారు.

ఒక్కసారి పోలీసులు విరుచుకుపడి జనం మధ్య లోంచి దారిచేసి రెండువైపులా నిల్చున్నారు. ఐదుకార్లు... రెండు బస్సులతో జవానులు వచ్చారు.

"జ్యోతి ఉంది- అదిగో," అన్నరెవులో.

తొక్కిసలాట. "జ్యోతిని విడుదల చేయండి..." అరుపులు.

జ్యోతి ముఖం కళ్లముందు కదులుతుంది జేమ్సుకి... రాత్రి కూడా...

*

రాత్రి పదిగంటలు దాటిపోయింది. కొండల, చెట్లూ, రోడ్డు అన్నీ చీకట్లో కలిసిపోయాయి జేమ్సు, జ్యోతి రోడ్డు మీద ఏవేవో మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. రాత్రి వీరఘట్టాంలో చూసిన మొదటి ఆట సినిమా బుర్ర నుంచి చెదరలేదు. నవ్వుకునే సన్నివేశాన్ని తిరగ దోడుతున్నాడు జేమ్సు. కొండమలుపు తిరిగేసరికి ఇద్దరి మీదా లైట్లు పడ్డాయి. గాబరాగా కొండవైపు జ్యోతి, లోయవైపు జేమ్సు తప్పుకున్నారు. నాలుగు అడుగులు ముందుకెళ్లి జీపు ఆగింది... అందులోని కొందరు గెంతి... ఇద్దరినీ పట్టుకొన్నారు. ఇద్దరి మొకాల మీద టార్చిలైటు వేసి చూసాడు... ఎస్సై.

"నీ పేరేటిరా?"

"జేమ్సు."

"నీ పేరూ?"

"జో... జ్యోతి."

జ్యోతి చెప్పగానే, "నేననుకున్నాను... నీవు జ్యోత క్కవే..." ఎస్సై అనేసరికి ఈడ్చుకెళ్లి జీపులోకి నెట్టేశారు పోలీసులు. జీపు కదిలింది.

"బావూ... కాదు బావూ..." జేమ్సు అరుస్తూనే పరిగెడుతున్నాడు. లైట్లు దూరంగా వెళ్లిపోతున్నాయి. "జ్యోతీ..." ఒక మాట మూడు మాటలైంది.

*

"జ్యోతీ..." పిలిచాడు జేమ్సు. పోలీసులు నెట్టేశారు. పెద్దాయన... మణిమ్మలు లోపలికెళ్లారు. కొద్దిసేపటికి కలెక్టరు, యస్పీ, ఎమ్మెల్యేలతో జ్యోతిని తీసుకుని వచ్చారు.

"పొరపాటు జరిగింది. నక్సలైటు జ్యోతి - కిల్లడ జ్యోతి ఒకే పోలికలు ఉండటం వలన మావాళ్లు పొర పాటు పడ్డారు," అన్నారు యస్పీగారు.

"అదేనా జ్యోతి చేసిన తప్పు" ఎవరో కేక లేస్తు న్నారు.

జ్యోతిని తీసుకొని ఎమ్మెల్యేగారు బయటపడ్డారు.

ఎమ్మెల్యేగారి కారులో జ్యోతి, మణిమ్మ, శిరి మెల, జేమ్సు, మల్లు మరికొందరు నేరేడు మానుగూడ వైపు కదిలారు. మార్గమధ్యంలో-

"మణిమ్మగారు... ఈ మండలానికి మీ నాయ కత్వం అవసరం," అన్నారు ఎమ్మెల్యేగారు.

''మా కెందుకులెండి... రాజకీయాలు,'' నవ్వుతూ అంది.

''లేదు మీరేదో పార్టీలో చేరుతున్నారని విన్నాను.''

''పుకార్లే... నేను వీధిలోకి రావడం ఇదే మొదటి సారి.''

''సరే తరువాత మాట్లాడుదాం... మీరు బాగా ఆలోచించండి... ఆయనగారు ఏం చేస్తున్నారు...'' అడిగారు ఎమ్మెల్యేగారు.

''టీచర్.''

''మనవాడేనా?''

''ఆ... షెడ్యూల్ ట్రైబే,'' అంటూ ముగించింది.

*

కందికొత్తల డప్పులుతో ఎదురొచ్చారు. జనంలో గీదరయ్య. వెలుతుర్లో జ్యోతినీ, మణిమ్మనీ ఎగబడి చూశారు జనం. మల్లు దగ్గరికీ గీదరయ్య వెళ్లి, ''ఒరే మల్లూ మనోలు మీ పోడు దగ్గరున్నారు... ఎంత వేళ కొచ్చినా రమ్మన్నారు... అదిగో మర్సిపోనాను... అమ్మ గారు తెచ్చిన మందులున్నాయి. ఆ టీకొట్టోడు ఇచ్చాడని చెప్పేసి... ఇచ్చీ,'' అన్నాడు గీదరయ్య చీకట్లో-

''ఎల్తానయితే,'' కదిలాడు.

''బావూ... మీరూ వచ్చారా?'' ఎమ్మెల్యేగార్ని పలకరించాడు గీదరయ్య. నవ్వారు ఎమ్మెల్యేగారు.

''తమరు... హైదరాబాదు ఎలిపోతామన్నారు... ఫోనొచ్చిందన్నారు.''

''దానికంటే ఇది ముఖ్యం కదా.''

''అవును బావూ... మీరొత్తారని నాకు తెల్సు బావూ...'' అని గీదరయ్య అంటే ఎర్రటి అక్షరాలు- 'జ్యోతి విడుదలకు మీరు బాధ్యత తీసుకోవాలి,' మళ్లీ చదువుతున్నట్లనిపించింది ఎమ్మెల్యేగారికి. ఆడామగా జంటలు జంటలుగా గెంతుతున్నారు. కొత్త కంది కాయలు ఉడకబెట్టినవి ఎమ్మెల్యేగారికీ అందరికీ యిచ్చారు. కందికాయలు తింటూ నృత్యం చూస్తున్నారు నాయకులు.

*

సవర పిల్లుల రెండు పిల్లలు పట్టుకొని తిరిగొచ్చాడు మల్లు.

''మల్లూ దొరికిపోయిందా.....! ఎటెలిపోద్దిరా నాను సెప్పానుగదా! వొడుపు కుదరప్పోతే మనుషులైనా జంతువులైనా అమరిపోతాయిరా,'' అంటూ, ''పాపం నిన్నటి పరుగులకి నెపులొచ్చీసి ఉంటాయి,'' అన్నాడు గీదరయ్య.

''ఎలా దొరికింది,'' ఎమ్మెల్యేగారు అడిగారు.

''ఎలాగంతే... మాలాగే... మరేటి ఈనకాసి నక్కల పాల్చేసిన జాతి సెమరపిల్లిది, కష్టపడి పొగుజేసి పల్లపోడి పాల్చేసిన జాతి సవరోడిది. తుప్పల్లో గుమ్మితవ్వి పిల్లల్ని బెట్టి తుప్ప చూట్టూ తిరిగి కాపలా కాస్తాది... ఆ తెలివైన జాతి,'' అన్నాడు గీదరయ్య.

ఎమ్మెల్యేగారు నవ్వి పొంగిపోయి, ''నాకొకటి కావాలి,'' అనేసి మళ్లీ నవ్వు కొనసాగించారు.

''ఈమధ్య రాజకీయ నాయకులందరికీ అడివి జంతువుల మీద మనసు పోయినట్టుంది,'' అంది మణిమ్మ.

''అదృష్టవంతులం... అడవి మనుషులమీద లేనందుకు,'' అన్నారెవులో.

''నేను వస్తానయితే...'' అంటూ లేచివెళ్లి గొడ్డమ్మ వారికి మొక్కి బయల్దేరిపోతూ, ''మణిమ్మా బాగా ఆలోచించి తొందరగా నిర్ణయం తీసుకోండి... మనం ఏదో చెయ్యాలనీ... మనకుంటుంది కానీ, ఏమీ చేయలేం. ఇలా అయితే కొంతయినా చెయ్యగలం,'' అంటూ కారెక్కేశారు ఎమ్మెల్యేగారు.

జ్యోతి ప్రశాంతంగా పడుకుంది. అందరూ గడపలో కూర్చొని ముచ్చట్లు చెప్పుకొంటున్నారు.

''అమ్మీ శిరిమెలా,'' అని పిలిచాడు గీదరయ్య. డప్పులు మోగుతున్నాయి.

''నీ గోరపిట్టే...''

మౌనంగా ఉండిపోయింది శిరిమెల.

''ఎలిపొచ్చిందే... ఏది ఎక్కడుండాలో... అక్కడే ఉండాలమ్మా... అదిగో జ్వొరమొచ్చి జ్యోతిలాగ వడికిపోతుంటే- గూటిలోన పెట్టాను,'' అని చెప్పగానే గోరపిట్టలా ఎగిరింది శిరిమెల. గూటిలో పిట్ట చచ్చిపోయి కర్ర కట్టీసింది. దీపం దగ్గరికి తెచ్చి చూసింది. రెక్కల్లోనూ..... తలపైనా చీమలు పాకుతున్నాయి. పరాయి చేయి తగిలి మాడిపోయిన అడివిలా వుంది గోరపిట్ట ముఖం.

''మనవాళ్ని కలవాలనుంది,'' అంది గీదరయ్యతో మణిమ్మ.

''దా అమ్మ... ఇప్పుడే కలుద్దాం,'' తీసుకెళ్లాడు గీదరయ్య.

*వంశధార కథల సంపుటి, 21 ఫిబ్రవరి 1999*